



DD9 వార్త
తెలుగు దినపత్రిక

## టీఎంసీ మహిళా వ్యతిరేక పార్టీ

**బెంగాల్ పర్యటనలో ప్రధాని మోదీ విమర్శలు**
**మహిళా రిజర్వేషన్‌పై ముదిరిన రాజకీయం**
**కాంగ్రెస్‌తో కలిసి అడ్డంకులు సృష్టించారన్న ప్రధాని**
**మహిళా సాధికారతపై బీజేపీ దృష్టి**
**ఎన్నికల ముందు హెచ్చరికలు, ఆరోపణలు**
**సంక్షేమ హామీలతో బీజేపీ ఎన్నికల వ్యూహం**



03

సంపుటి : 02 సంచిక : 240 హైదరాబాద్, ఏప్రిల్, సోమవారం 20, 2026 పేజీలు : 06 వెల : 3.00

# జగిత్యాల.. జంగ్ సైరన్!

**జీవన్‌రెడ్డి ఎపిసోడ్‌తో కాంగ్రెస్ ముఖ్య నేతల్లో ఆందోళన**
**ఎవరు, ఎప్పుడు, ఎలాంటి బాంబు పేలుస్తారోనన్న గుబులు**
**జిల్లాకు ఒకరిద్దరు అసమ్మతి నేతలున్నారంటున్న పార్టీ వర్గాలు**
**వివిధ కారణాలతో పార్టీలో ఇమడలేక.. వీడలేక సతమతం!**
**బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఎమ్మెల్యేలున్న చోట్ల అందరి పరిస్థితీ ఇదే**
**జీవన్‌రెడ్డి విషయంలో అధిష్టానం, ముఖ్య నేతలు సరిగా వ్యవహరించలేదనే భావన..**
**భవిష్యత్ పరిణామాలపై కలవరం**



హైదరాబాద్, (డిడి9 వార్త):

సీనియర్ నేత జీవన్‌రెడ్డి పార్టీని వీడటం, అందుకు దారి తీసిన పరిస్థితులు అధికార కాంగ్రెస్‌లో కొత్త చర్చకు దారి తీస్తున్నాయి. జగిత్యాల వేదిక గా చోటు చేసుకున్న ఈ పరిణామం ఎటు తిరిగి ఎటు వెళుతుందోనన్న ఉత్కంఠ ఆ పార్టీ ముఖ్య నేతల్లో కనిపిస్తోంది. అంతర్గత ప్రజాస్వామానికి పెట్టింది పేరయిన పార్టీలో ఎవరు, ఎప్పుడు, ఎలాంటి బాంబు పేలుస్తారో.. ఎన్నికలు సమీపించే కొద్దీ జగిత్యాల అలజడి ఎలాంటి అసమ్మతి సుడిగుండాలను సృష్టిస్తుందోనన్న గుబులు అంతర్గతంగా వ్యక్తమవుతోంది.

జిల్లాకు ఒకరిద్దరు..!: కాంగ్రెస్‌లో అసంతృప్తులు, అసమ్మతులు సహజం. అయితే రాష్ట్రం పార్టీ అధికారంలో ఉండడం, భవిష్యత్తుపై ఆశలు ఉండడంతో చాలామంది నేతల్లో వివిధ కారణాలతో అసమ్మతి ఉన్నా పంటి బిగువున నెట్టుకొస్తున్నారనే వాదన ఉంది. తమ భవిష్యత్తు ..మిగతా 2లో

## రేవంత్ రెడ్డి 70 సార్లు ఢిల్లీకి వెళ్లారు కానీ కల్లాలకు రారా..?

**ధాన్యం కొనుగోళ్లలో అవ్యవస్థలపై హరీష్ రావు ఫైర్**
**మిల్లర్ల దోపిడీ.. రైతుల ఆవేదన వెల్లడి**
**రైతులు కల్లాల వద్ద తీవ్ర ఇబ్బందులు**
**నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం జూనూతల సందర్శన**
**ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన**
**సీఎం ఢిల్లీ పర్యటనలపై ఘాటు వ్యాఖ్యలు**
**సమస్యలు పరిష్కరించకపోతే బీఆర్ఎస్ ఆందోళన హెచ్చరిక**

హైదరాబాద్, (డిడి9 వార్త):

రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ అస్తవ్యస్తంగా మారిందని, రైతులు కల్లాల వద్దే కన్నీరు మున్నీరవుతున్నారని మాజీ మంత్రి హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం జూనూతల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన, అక్కడ పేరుకుపోయిన ధాన్యం బస్తాలను పరిశీలించి రైతులతో ముఖాముఖి





## జనగణనలో ఆదివాసీ మతం కాలమ్ పెట్టాలి

**కేంద్ర ప్రభుత్వం ఆదివాసీల హక్కులను హరిస్తోంది**
**PESA చట్టాన్ని బలహీనపరుస్తున్నారని విమర్శ**
**రాజ్యాంగ రక్షణలను తొలగించే ప్రయత్నం**
**మతం కేటగిరీలో "ఆదివాసీ" కాలమ్ లేదు**
**ఆదివాసీలు తమ గుర్తింపును తెలిపే అవకాశం తగ్గింది**
**సంస్కృతికి అవమానం అని విమర్శ**
**ఆదివాసీల హక్కుల పరిరక్షణ అవసరం**
**కేంద్ర విధానాలపై తీవ్ర విమర్శలు**
**తక్షణ చర్యలపై కవిత డిమాండ్**

హైదరాబాద్, (డిడి9 వార్త):

కేంద్ర ప్రభుత్వం ఆదివాసీల హక్కులను హరిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. పెసా (PESA) చట్టానికి తూట్లు పొడుస్తూ రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూల్లోని రక్షణలను తొలగిస్తోందని ధ్వజమెత్తారు. జనగణనలో మతం కేటగిరిలో ఆదివాసీ అనే కాలమ్ పెట్టలేదని దీంతో ఆదివాసీలు తాము ఆదివాసీలమని సగర్వంగా చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఇది దేశ మూలవాసులైన ఆదివాసీల సంస్కృతిని అవమానించడమేనని జనగణనలో తమది ఆదివాసీ మతం అని చెప్పుకునేలా ప్రత్యేక కాలమ్ పెట్టడంతో పాటు ఆదివాసీల భాష 'కోయతూర్' ను భారత రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్ చేర్చాలని డిమాండ్ చేశారు. ఇవాళ కవితతో మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర, ఆల్ ఇండియా ఆదివాసీ కానిస్టిట్యూషనల్ రైట్స్ అండ్ కల్చరల్ ప్రొటెక్షన్ జేఏసీ నాయకులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలతో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను కవితకు ..మిగతా 2లో

## ఎండలు బాబోయ్.. ఎండలు

**45 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు.. ప్రజలు బెంబేలెత్తు**
**రాయలసీమలో రికార్డు స్థాయి వేడి, వడగాల్పుల హెచ్చరిక**
**తెలంగాణలో ఆరెంజ్ అలర్ట్.. జిల్లాలకు అప్రమత్తం**
**మూడు రోజుల్లో వర్షా లు.. స్వల్ప ఉపశమనం అవకాశం**



హైదరాబాద్, (డిడి9 వార్త):

వేసవి కాలం తన ప్రతాపాన్ని చూపిస్తోంది. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ , ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు మునుపెన్నడూ లేని విధంగా మండిపోతున్నాయి. ఏప్రిల్ నెలలోనే ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును చేరువవుతుండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 9 గంటలకే భానుడు తన ప్రతాపాన్ని మొదలుపెడుతుండగా, మధ్యాహ్న సమయానికి రోడ్లన్నీ జనసంచారం లేక కర్ఫ్యూను తలపిస్తున్నాయి. అటు వడగాల్పుల తీవ్రత కూడా ..మిగతా 2లో

## టార్గెట్ రేవంత్ రెడ్డి? మోడీ?

### ఏడాది తర్వాత జనంలోకి వస్తున్న గులాబీ బాస్



**జగిత్యాలలో ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లు**
**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే లక్ష్యంగా విమర్శనాస్త్రాలు సంధించే అవకాశం**
**కేసీఆర్ ప్రసంగంపై రాజకీయ వర్గాలతోపాటు ప్రజల ఆసక్తి**
**ఇప్పటికే పూర్తయిన ఏర్పాట్లు**
**భారీ జనసమీకరణకు పార్టీ శ్రేణుల కసరత్తు**

హైదరాబాద్, (డిడి9 వార్త):

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి పొలిటికల్ హీట్ పెరిగింది. ఒకే రోజు అధికార, ప్రతిపక్ష నేతల పర్యటనలు ఆసక్తిగా మారాయి. రేపు జగిత్యాలలో బహిరంగ సభకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ (KCR) హాజరు కాబోతుండగా అదే రోజు సీఎం రేవంత్ రెడ్డికాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఉన్న మేడిగడ్డ బ్యారేజీ పరిశీలనకు వస్తుండటం సంచలనం రేపుతోంది. అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య ..మిగతా 2లో

## గవర్నర్‌తో సీఎం రేవంత్ కీలక భేటీ

**ఎమ్మెల్సీ నియామకాలు, డ్రగ్స్ నిరోధంపై విస్తృత చర్చ**
**పెండింగ్‌లో ఉన్న ఎమ్మెల్సీ ఫైళ్లపై నిర్ణయం కోరిన ప్రభుత్వం**
**కోదండరామ్, అజారుద్దీన్ పేర్ల ఆమోదంపై దృష్టి**
**మంత్రి పదవికి గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఉత్కంఠ**
**విద్యా రంగం, యువత భవిష్యత్తుపై చర్చల ప్రాధాన్యం**
**డ్రగ్స్ నివారణకు సంయుక్త కార్యాచరణ రూపకల్పన**
**విద్యార్థుల నుంచి ప్రమాణ పత్రాల ప్రతిపాదన**
**ఎల్బీ స్టేడియంలో భారీ అవగాహన కార్యక్రమానికి సిద్ధత**
**రాజ్యాంగపరమైన అంశాలపై అధికారుల వివరణలు**



హైదరాబాద్, (డిడి9 వార్త):

రాష్ట్ర రాజకీయ పరిణామాల్లో కీలక మలుపు తిరిగే అవకాశాలు కనిపిస్తున్న వేళ, రేవంత్ రెడ్డి గవర్నర్‌ను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. పెండింగ్‌లో ఉన్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాలపై తక్షణ నిర్ణయం తీసుకోవాలని శివప్రతాప్ శుక్లాను కోరారు. ముఖ్యంగా ప్రొఫెసర్ కోదండరామ్, మహమ్మద్ అజారుద్దీన్ పేర్లను ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నియామకాలు ఆలస్యం అవుతున్న నేపథ్యంలో రాజకీయంగా, రాజ్యాంగపరంగా అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం మంత్రివర్గంలో ..మిగతా 2లో

## తెలంగాణ ఏర్పాటును అడుగడుగునా బీజేపీ అవమానిస్తోంది

**తెలంగాణ విభజనపై బీజేపీ వ్యాఖ్యలపై కడియం ఫైర్**
**భారత్-పాక్ పోలికపై తీవ్ర ఆగ్రహం**
**అభివృద్ధిలో కేంద్రం వివక్ష చూపిందా?**
**తెలంగాణ ఆత్మగౌరవంపై రాజకీయ వేడి**



హైదరాబాద్, (డిడి9 వార్త):

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు , విభజన అంశంపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అనుసరిస్తున్న తీరుపై మాజీ మంత్రి కడియం శ్రీహరి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటును బీజేపీ నాయకత్వం అడుగడుగునా అవమానిస్తోందని, వారి నిజ స్వరూపం తెలంగాణకు వ్యతిరేకమని ఆయన ధ్వజమెత్తారు. శనివారం మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, కేంద్ర ప్రభుత్వం , ప్రధాని మోదీ ..మిగతా 2లో

# రేవంత్ రెడ్డి 70 సార్లు ఢిల్లీకి వెళ్లారు కానీ కల్లాలకు రారా..?

**మొదటిపేజీ తరువాయి**



మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు పడుతున్న ఇబ్బందులను విన్న హరీష్ రావు, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని, మిల్లుల వద్ద లారీలు అన్ లోడ్ కాక రోజుల తరబడి రైతులు వేచి చూడాల్సి వస్తోందని హరీష్ రావు మండిపడ్డారు. తాలు, పచ్చ గింజ పేరుతో మిల్లర్లు వడ్లను తిరస్కరిస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. "ధాన్యంలో 5 కిలోల తరుగు తీస్తున్న వారి తోలు తీయాలి" అని ఆయన హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాలలో కనీస వసతులు లేవని, వర్షం వస్తే ధాన్యం తడిసి ముద్దవుతున్నా పట్టించుకునే నాథుడే లేడని ధ్వజమెత్తారు. వరి ధాన్యమే కాకుండా మొక్కజొన్న, జొన్న కొనుగోళ్లు కూడా అటకెక్కాయని, ప్రభుత్వం ఇప్పటివరకు వాటి ఊసే ఎత్తడం లేదని విమర్శించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై హరీష్‌రావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "ముఖ్యమంత్రి 70 సార్లు ఢిల్లీకి వెళ్లారు కానీ, ఒక్కసారి కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చి రైతుల కష్టాలను చూడలేదు" అని ఎద్దేవా చేశారు. అధికారులకు, ఎమ్మెల్యేలకు, మంత్రులకు రైతుల గోడు పట్టడం లేదని, తక్షణమే వారు క్షేత్రస్థాయిలో పర్యటించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. JJL 24433 వంటి దొడ్డు రకాలు , KNM సన్న రకాలను ప్రభుత్వం బేషరతుగా కొనుగోలు చేయాలని సూచించారు.

ప్రస్తుత ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని హరీష్‌రావు విమర్శించారు. సన్న వడ్లకు బోనస్ రావడం లేదని, రైతు భరోసా ఇప్పటికీ అందరికీ అందలేదని, పంట బీమా ఊసే లేదని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయకపోతే, బీఆర్ఎస్ పార్టీ తరపున పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. రైతుల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం క్షేత్రస్థాయిలో ఉద్యమిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# టార్గెట్ రేవంత్ రెడ్డి? మోడీ?

**మొదటిపేజీ తరువాయి**



ఒకే రోజు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పర్యటనలు ఉండటంతో రాష్ట్రంలో మరోసారి మైండ్ గేమ్ మొదలైందా అనే చర్చ తెరపైకి వస్తోంది.

**ఏడాది తర్వాత పబ్లిక్ లోకి:**

కాంగ్రెస్ మాజీ నేత జీవన్ రెడ్డి కారెక్కేందుకు సిద్ధం అయ్యారు. ఈ నేపథ్యంలో జగిత్యాలలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తోంది. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి తర్వాత గులాబీ బాస్ కేసీఆర్ పబ్లిక్ లోకి రావడం లేదు. దాదాపు ఏడాది తర్వాత ఆయన బహిరంగ సభకు రాబోతున్నారు. గతేడాది ఏప్రిల్ 27న వరంగల్‌లో జరిగిన పార్టీ సిల్వర్ జూబ్లీ కార్యక్రమానికి హాజరైన కేసీఆర్ ఆ తర్వాత పబ్లిక్ మీటింగ్‌లకు ఎక్కడా హాజరు కాలేదు. అత్యంత ముఖ్యమైన కార్యక్రమాలు మినహా మిగతా అన్ని వ్యవహారాలు ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ నుంచే కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఏడాది తర్వాత రేపు జగిత్యాల సభకు కేసీఆర్ వస్తుండటం స్టేట్ పాలిటిక్స్ లో ఆసక్తిగా మారింది.

**రేవంత్ రెడ్డి? మోడీ?:**

సుదీర్ఘ విరామం తర్వాత పబ్లిక్ మీటింగ్‌కు హాజరు కాబోతున్న కేసీఆర్.. ఈ సభ ద్వారా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయబోతున్నారు. అయితే ఇన్నాళ్లు పార్టీపై అధికార పక్షం తీవ్ర స్థాయిలో దాడి చేసినా మౌనంగా ఉన్న కేసీఆర్ జగిత్యాల సభ ద్వారా తన ప్రత్యర్థులకు ఎలాంటి కౌంటర్ ఇవ్వబోతున్నారు అనేది ఉత్కంఠగా మారింది. అసలు రేపటి సభలో ఆయన టార్గెట్ చేయబోయేది సీఎం రేవంత్ రెడ్డినా? లేక ప్రధాని మోడీనా అనేది సస్పెన్స్‌గా మారింది. ఇవేవి కాకుండా తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ పరిణామాల దృష్ట్యా చంద్రబాబుపై విమర్శలు ఎక్కుపెడతారా అనేది వేచి చూడాలి.

**కేసీఆర్ వైఫల్యాలే టార్గెట్ రేవంత్ రెడ్డి స్కెచ్:**

ఇక కేసీఆర్ సభ రోజే సీఎం రేవంత్ రెడ్డి మేడిగడ్డ పర్యటనకు వెళ్తుండటం హాట్ టాపిక్‌గా మారింది. మేడిగడ్డ వైఫల్యాలను క్షేత్రస్థాయిలో చూపించడంతో పాటు అక్కడికక్కడే బీఆర్ఎస్‌కు, కేసీఆర్‌కు కౌంటర్ ఇవ్వాలనేది రేవంత్ రెడ్డి ఆలోచనగా తెలుస్తోంది. ఇటీవలే కాళేశ్వరంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా రేపు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సీఎం మేడిగడ్డను పరిశీలించబోతున్నారు. కాళేశ్వరం విషయంలో ఈసారి సీఎం డోస్ ఎలా ఉండబోతోంది అనేది ఆసక్తిగా మారింది.

# జనగణనలో ఆదివాసీ మతం కాలమ్ పెట్టాలి

**మొదటిపేజీ తరువాయి**

చందా లింగయ్య దొర వివరించారు.

వారి గౌరవాన్ని కాపాడేలా రాజకీయ పార్టీ:

ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆదివాసీల హక్కులను పరిరక్షించేందుకు ఆల్ ఇండియా ఆదివాసీ కానిస్టిట్యూషనల్ రైట్స్ అండ్ కల్చరల్ ప్రొటెక్షన్ జేఏసీ చేస్తున్న పోరాటానికి తెలంగాణ జాగృతి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం పాటు పడుతామని హామీ ఇచ్చారు. దేశంలోని 12 కోట్ల మంది ఆదివాసీలు నిజమైన భారత దేశ సంస్కృతికి ప్రతినిధులని వారి గౌరవాన్ని కాపాడేలా మేము ఏర్పాటు చేయబోయే రాజకీయ పార్టీ ఉంటుందన్నారు. పోలవరం ప్రాజెక్టులో 3 లక్షల మంది ఆదివాసీలను అడవి నుంచి దూరం చేస్తున్నారని కవిత ఆరోపించారు. తిరిగి వారికి అడవిలో అన్ని సౌకర్యాలతో కూడిన పునరావాసం కల్పించడం లేదని మండిపడ్డారు.



# జగిత్యాల.. 'జంగ్' సైరన్!

**మొదటిపేజీ తరువాయి**

ప్రస్తుతానికి గందరగోళంగా ఉన్నా కొంత కాలం తర్వాత అంతా సర్దుకుంటుందనే ఆశతో పార్టీలో ఉండలేక, వెళ్లలేక, సతమతమవుతున్నారు. ఇలాంటి నేతలు జిల్లాకు కనీసం ఒకరిద్దరున్నారని గాంధీభవన్ వర్గాలే అంటున్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్‌లోకి వచ్చామని చెప్పుకుంటున్న నియోజకవర్గాల్లోని నేతలందరిదీ దాదాపు ఇదే పరిస్థితి. సింగాపురం ఇందిర, పి.విజయారెడ్డి, పొదెం వీరయ్య, భిక్షపతి గౌడ్, భీంభరత్, సరితాయాదవ్, కాట శ్రీనివాస్‌గౌడ్, కస్తూరి రాజేందర్ లాంటి నాయకులంతా గందరగోళ పరిస్థితుల్లోనే ఉన్నారు. వీరితో కనీసం మాట్లాడే వారు, సర్దిచెప్పేవారు కూడా లేరని అంటున్నారు. పదేళ్ల పాటు పార్టీని అంటి పెట్టుకుని ఉన్నామని, ఇప్పుడు ఏం చేయాలో కూడా పాలుపోవడం లేదని వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఎన్నికల నాటికి తమ దారి తాము చూసుకుంటామనే హెచ్చరికలతో కూడిన అభిప్రాయాలను బయటకు చెప్పకపోయినా అంతర్గతంగా వ్యక్తం చేస్తున్నారు. తమ విషయంలో పార్టీ, నాయకత్వ వ్యవహారశైలిపై నిట్టూరుస్తూనే ఉన్నారు.

**ఆత్మహత్య చేసుకోవాలనిపించిందన్న చిన్నారెడ్డి**

సీనియర్ నేత చిన్నారెడ్డిది కూడా జీవన్‌రెడ్డి లాంటి పరిస్థితే. తనకు ఆత్మహత్య చేసుకోవాలని అనిపించిందనే స్థాయిలో ఆయన తన అసంతృప్తిని వెలిబుచ్చినా పార్టీ నాయకత్వం ఏ మాత్రం సీరియస్‌గా తీసుకోలేదనే విమర్శలున్నాయి. ఇక అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా గత ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్లు ఆశించి భంగపడినవారు, పోటీ చేసి ఓడిపోయిన వారు, నామినేటెడ్ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న నేతలు... ఇలా అనేకమందిలో అసమ్మతి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొందరిని సముదాయించేందుకు డీసీసీ అధ్యక్షులుగా, కార్పొరేషన్ చైర్మన్లుగా నియమించినా లోలోన అసమ్మతి సెగలు మాత్రం అలాగే ఉన్నాయని అంటున్నారు. ముఖ్యంగా సమన్వయ లేమి కారణంగానే నాగం జనార్ధన్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య లాంటి నేతలను దూరం చేసుకున్నామంటూ నెమరువేసుకుంటున్నారు. జీవన్‌రెడ్డితో అధిష్ఠానం చర్చించి ఉంటే బాగుండేదని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వ్యాఖ్యానించడం, ఎంపీ మల్లు రవి కూడా ఆయన వెళ్లిపోవడం బాధాకరమే అన్న రీతిలో మాట్లాడటం గమనార్హమని చెబుతున్నారు.

**టేకిటీజీగా తీసుకున్నారా?**

వాస్తవానికి జీవన్‌రెడ్డి చాలా రోజులుగా అసంతృప్తి గళం వినిపిస్తున్నారు. 42 సంవత్సరాలుగా పార్టీలో కొనసాగుతున్న తనను కాదని, కనీసం తనకు చెప్పకుండా, తనపై గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేను పార్టీలోకి తీసుకున్నప్పుడే ఆయన భగ్గుమన్నారు. అప్పటి నుంచీ సందర్భమెప్పుడొచ్చినా ఆయన అసమ్మతి గళం వినిపిస్తూనే ఉన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీలో జగిత్యాల పంచాయతీ నడుస్తూనే ఉంది. చివరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గాంధీభవన్‌కు వచ్చి పార్టీ సమావేశంలో పాల్గొనడం, మున్సిపల్ ఎన్నికల సమయంలో జరిగిన పరిణామాలు, ఫలితాల అనంతరం పార్టీ తీసుకున్న నిర్ణయం లాంటివి జీవన్‌రెడ్డి సీనియారిటీ, సిన్సియారిటీపై ప్రశ్నలు లేవనెత్తేలా చేశాయనే భావన వ్యక్తమైంది. అయితే జీవన్‌రెడ్డి గురించి పార్టీలో అంతర్గతంగా చాలా చర్చ జరిగింది.



ముఖ్య నేతలు కలిసినప్పుడు, కరీంనగర్ రాజకీయాలు మాట్లాడినప్పుడు, పీఏసీ సమావేశాల్లోనూ ఆయన గురించి ప్రస్తావనలు వచ్చాయి. కానీ ఆయనే సర్దుకుంటారులే అన్న ధీమాతో పాటు ఇప్పుడు బయటకెళ్లి ఏం చేస్తారులే అనే అభిప్రాయమే చివరివరకు కొనసాగింది. పీసీసీ చీఫ్, సీఎం ఇద్దరూ టేకిటీజీ ధోరణిలోనే వెళ్లారనే భావన కొందరు వ్యక్తం చేయడం గమనార్హం. ఏతావాతా జీవన్‌రెడ్డికి సరైన భరోసా లభించలేదు. జగ్గారెడ్డి, మల్లు రవి మాదిరిగానే చివరి నిమిషంలో మంత్రి శ్రీధర్‌బాబు కూడా జీవన్‌రెడ్డిని వెళ్లనివ్వకుండా ఆపాలని పార్టీ నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. చాలామంది నేతలు జీవన్‌రెడ్డిని పార్టీ విడిచిపెట్టదనే అనుకున్నారు. కానీ జీవన్‌రెడ్డి నాలుగు దశాబ్దాల అనుబంధాన్ని వదులుకున్నారు. ఇది బాధాకరమే అయినప్పటికీ తప్పడం లేదనే అభిప్రాయం వ్యక్తం చేశారు. చివరకు బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నారు.

# గవర్నర్‌తో సీఎం రేవంత్ కీలక భేటీ

**మొదటిపేజీ తరువాయి**

కొనసాగుతున్న మహమ్మద్ అజారుద్దీన్ పరిస్థితి ఈ అంశాన్ని మరింత కీలకంగా మార్చింది. ఆయన ఎలాంటి సభకు సభ్యుడు కాకుండానే మంత్రి పదవిలో కొనసాగుతున్నారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం, ఆరు నెలల్లోపు శాసనసభ లేదా శాసన మండలిలో సభ్యత్వం పొందాల్సి ఉంటుంది. ఈ గడువు ఈ నెలాఖరుతో ముగియనున్న నేపథ్యంలో, ఎమ్మెల్సీగా నియామకం జరగకపోతే మంత్రి పదవి కోల్పోయే పరిస్థితి ఏర్పడే అవకాశముంది. దీంతో ఈ అంశంపై ప్రభుత్వం అత్యవసరంగా చర్యలు తీసుకుంటోంది.ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కార్యాలయం తరపున గవర్నర్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. ఇప్పటికే ఉన్న సాంకేతిక అడ్డంకులు తొలగిపోయాయని, వెంటనే ఫైళ్లపై ఆమోద ముద్ర వేయాలని అభ్యర్థించారు. దీనికి ముందు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ జనరల్ కూడా గవర్నర్‌ను కలిసి రాజ్యాంగపరమైన అంశాలపై వివరణ ఇచ్చినట్లు సమాచారం. ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారి తీస్తున్నాయి.

ఈ భేటీ కేవలం రాజకీయ నియామకాలకే పరిమితం కాలేదు. రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన కీలక అంశాలు కూడా చర్చకు వచ్చాయి. ముఖ్యంగా విద్యా రంగం, యువత సమస్యలు, మాదకద్రవ్యాల వ్యాప్తి వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలో పెరుగుతున్న డ్రగ్స్ సమస్యపై ఆందోళన వ్యక్తం చేస్తూ, దాన్ని నిర్మూలించేందుకు సంయుక్త కార్యాచరణ అవసరమని అభిప్రాయం వ్యక్తమైంది.విద్యార్థులను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడటానికి కొత్త చర్యలను పరిశీలించారు. విద్యాసంస్థల్లో అడ్మిషన్ సమయంలోనే విద్యార్థుల నుంచి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రమాణ పత్రాలు తీసుకోవాలని గవర్నర్ సూచించారు. ఇది విద్యార్థుల్లో అవగాహన పెంచడమే కాకుండా, బాధ్యతను కూడా కలిగిస్తుందని భావిస్తున్నారు. విద్యాసంస్థల్లో నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. జూన్ 12న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, యువతలో డ్రగ్స్ ప్రమాదాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమం నిర్వహణపై కూడా భేటీలో చర్చించారు.విద్యారంగంలో మౌలిక వసతుల అభివృద్ధి, యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీ, ఉన్నత విద్యా ప్రమాణాల మెరుగుదల వంటి అంశాలు కూడా చర్చకు వచ్చాయి. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా విద్యాసంస్థల పనితీరు మెరుగుపడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ విధానాలు యువతకు ఉపయోగపడేలా ఉండాలని సూచించారు.

గవర్నర్ సూచనలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యార్థుల నుంచి ప్రమాణ పత్రాలు తీసుకోవడం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి చర్యలను త్వరలో అమలు చేస్తామని తెలిపారు. జూన్‌లో జరిగే భారీ కార్యక్రమానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ భేటీ రాష్ట్ర రాజకీయ, పరిపాలనా రంగాల్లో కీలక ప్రభావం చూపే అవకాశం ఉంది. ఒకవైపు ఎమ్మెల్సీ నియామకాలపై నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉండగా, మరోవైపు యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశాలపై చర్యలు చేపట్టాల్సిన పరిస్థితి ఉంది. ఈ రెండు అంశాలు రానున్న రోజుల్లో రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు.



# ఎండలు బాబోయ్.. ఎండలు

**మొదటిపేజీ తరువాయి**

తోడవడంతో సామాన్యుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతం ప్రస్తుతం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. నంద్యాల జిల్లా సంజామలలో అత్యధికంగా 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదై రికార్డు సృష్టించింది. ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ సుమారు 100 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసింది. అటు తెలంగాణలోనూ పరిస్థితి ఏమాత్రం భిన్నంగా లేదు. నిజామాబాద్, ఆదిలాబాద్, నల్గొండ వంటి జిల్లాల్లో ఎండలు మండిపోతున్నాయి. ఎండల తీవ్రత దృష్ట్యా వాతావరణ శాఖ తెలంగాణలోని పలు జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేస్తూ ప్రజలను అప్రమత్తం చేసింది.

ఎండల తీవ్రత , వడదెబ్బ బారి నుండి రక్షణ పొందేందుకు నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకపోవడం ఉత్తమం. శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఉండేందుకు మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలను తరచూ తీసుకోవాలి. వడదెబ్బ తగలకుండా ఉండేందుకు లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలి. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు లేదా టోపీని తప్పనిసరిగా వాడాలి.

ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు వాతావరణ శాఖ ఒక చిన్న ఊరటనిచ్చే వార్తను కూడా అందించింది. రాబోయే మూడు రోజుల్లో తెలంగాణ , ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీనివల్ల ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గి, వేడి నుండి కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది. అప్పటివరకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



## తెలంగాణ ఏర్పాటును అడుగడుగునా

# బీజేపీ అవమానిస్తోంది

**మొదటిపేజీ తరువాయి**



గతంలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ నిప్పులు చెరిగారు.

తెలంగాణ విభజనను భారత్‌పాకిస్తాన్ విడిపోవడంతో పోల్చడం అత్యంత దుర్మార్గమని కడియం శ్రీహరి వ్యాఖ్యానించారు. పార్లమెంట్ సాక్షిగా ఇటువంటి తెలివిలేని మాటలు మాట్లాడటం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటునే బీజేపీ జీర్ణించుకోలేకపోతోందని, అందుకే అడుగడుగునా విషం చిమ్ముతున్నారని విమర్శించారు.

కేంద్రంలో పదేళ్లకు పైగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి చేసిందేమీ లేదని కడియం శ్రీహరి ధ్వజమెత్తారు. గడిచిన 12 ఏళ్ల కాలంలో తెలంగాణకు ఒక్కటంటే ఒక్క జాతీయ ప్రాజెక్టు కూడా ఇవ్వలేదని, నిధుల కేటాయింపులోనూ తీవ్ర వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. అభివృద్ధి గురించి మాట్లాడకుండా, కేవలం రాష్ట్ర విభజనపై అనుచిత వ్యాఖ్యలు చేయడమే బీజేపీ పనిగా పెట్టుకుందని మండిపడ్డారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను, అనేక మంది బలిదానాలను కించపరిచేలా బీజేపీ నేతలు వ్యవహరిస్తున్నారని, దీనికి ప్రజలే బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. బీజేపీ నిజంగా తెలంగాణకు అనుకూలమైతే ఇక్కడి ప్రాజెక్టులకు ఎందుకు నిధులు ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు.

# టీఎంసీ మహిళా వ్యతిరేక పార్టీ

- బెంగాల్ పర్యటనలో ప్రధాని మోదీ విమర్శలు
- మహిళా రిజర్వేషన్‌పై ముదిరిన రాజకీయం
- కాంగ్రెస్‌తో కలిసి అడ్డంకులు సృష్టించారన్న ప్రధాని
- బిష్ణుపూర్ ర్యాలీలో మోదీ తీవ్ర వ్యాఖ్యలు
- మహిళా సాధికారతపై బీజేపీ దృష్టి
- గిరిజన అంశాలపై సుదీర్ఘ ప్రసంగం
- ఎన్నికల ముందు హెచ్చరికలు, ఆరోపణలు
- సంక్షేమ హామీలతో బీజేపీ ఎన్నికల వ్యూహం

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

బెంగాల్ రాజకీయాల్లో ఎన్నికల వేడి రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ అంశం కొత్త రాజకీయ వాదోపవాదాలకు దారి తీసింది.పార్లమెంట్‌లో రాజ్యాంగ 131వ సవరణ బిల్లుకు అడ్డంకులు ఏర్పడిన నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య విమర్శలు తారస్థాయికి చేరుకున్నాయి. ఈ బిల్లుతో పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే లక్ష్యం ఉందని పేర్కొంటూ, దాని ఆమోదానికి ఆటంకం కలిగించడం మహిళా సాధికారతకు వ్యతిరేకమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఈ నేపథ్యంలో బెంగాల్‌లో జరిగిన భారీ ఎన్నికల సభలో నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో స్పందించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడంలో తృణమూల్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని ఆరోపించారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తూ మహిళలకు న్యాయం జరగకుండా అడ్డుకట్ట వేసిందని విమర్శించారు. మహిళల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచే ఈ చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించడం ప్రజలు గమనించారని తెలిపారు.బిష్ణుపుర్‌లో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతూ మోదీ, మహిళా ఓటర్లే రాబోయే ఎన్నికల్లో తమ తీర్పు ఇస్తారని అన్నారు. రాష్ట్రంలోని మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ, వారి భద్రత, అభివృద్ధి, ఆర్థిక స్వావలంబనపై దృష్టి పెట్టడం బీజేపీ విధానమని చెప్పారు. మహిళలు రాజకీయాల్లోకి మరింతగా రావాలని, నిర్ణయాత్మక స్థానాల్లో ఉండాలని తమ లక్ష్యమని వివరించారు.

మహిళా సాధికారతను అడ్డుకోవడమే కాకుండా, బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతోందని టీఎంసీపై మోదీ ఆరోపించారు. చట్టాలను ఉల్లంఘిస్తూ కొంతమంది వర్గాలకు లబ్ధి చేకూర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. ఈ విధానాలు సమాజంలో విభేదాలకు దారి తీస్తాయని హెచ్చరించారు.గిరిజన అంశాలపై కూడా రాజకీయ వాగ్వాదం చెలరేగింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు తగిన గౌరవం ఇవ్వలేదని టీఎంసీపై మోదీ విమర్శలు గుప్పించారు. గిరిజన వర్గాల సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా గిరిజనులకు ప్రాధాన్యం పెంచే చర్యలు తీసుకుంటున్నామని, కానీ బంగాల్‌లో ఆ దిశగా సరైన ప్రయత్నాలు కనిపించడం లేదని పేర్కొన్నారు.

ఎన్నికల ముందు రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై కూడా మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. టీఎంసీకి చెందిన గుంపులు, సిండికేట్ వ్యవస్థలపై కఠిన హెచ్చరికలు జారీ చేశారు. ఎన్నికలకు ముందు చట్టపరమైన చర్యలకు లోబడాలని సూచిస్తూ, తరువాత కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడటంలో కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు. బంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే మహిళల కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఉచిత రేషన్‌తో పాటు "మాతృ శక్తి భరోసా" వంటి కార్యక్రమాల ద్వారా మహిళలకు వార్షిక ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం, భద్రతా చర్యలు, ఉపాధి అవకాశాలు పెంపు వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకుంటామని వివరించారు.

పొరుగు రాష్ట్రాల్లో అమలవుతున్న పథకాలను ప్రస్తావిస్తూ, అక్కడ మహిళలు పొందుతున్న ప్రయోజనాలు బంగాల్‌లో అందడం లేదని పేర్కొన్నారు. అవినీతి కారణంగా పేదలకు అందాల్సిన సౌకర్యాలు పూర్తిగా చేరడం లేదని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే పారదర్శక పాలన ద్వారా ప్రతి లబ్ధి నేరుగా ప్రజలకు చేరేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లు చుట్టూ తిరుగుతున్న ఈ రాజకీయ పోరు బంగాల్ ఎన్నికల్లో కీలక అంశంగా మారుతోంది. మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు అన్ని పార్టీలూ తమ తమ వ్యూహాలను అమలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాలకు కొత్త దిశను నిర్దేశించే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన గౌరవ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్.

- రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ ఏప్రిల్ 19(డి డి 9వార్త ):-**

నెరడిగొండ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ లో నిర్వహించిన నాఫెడ్ వారిచే తెలంగాణ రాష్ట్ర మార్కుఫెడ్ వారి ఆధ్వర్యంలో పీ.ఏసీ.ఎస్ నెరడిగొండ యందు మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని వారికి సహకరించాలని అన్నారు. ఎంతో కష్టపడి పండించే పంటలు తక్కువ ధరలకు అమ్మితే నష్టపోతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు,రైతులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



## ఘనంగా బసవేశ్వర మహారాజ్ జయంతి వేడుకలు

**నిజామాబాద్ పోతంగల్ ఏప్రిల్ 19(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా, పోతంగల్ మండల కేంద్రంలోని , బస్టాండ్ వద్ద బసవేశ్వర విగ్రహానికి పూల మాల వేసి జయంతి వేడుకలు ప్రారంభించారు. భక్తి పాటలతో భజన కార్యక్రమం ఆడపడుచులు మంగళహారతులతో ఘనంగా నిర్వహించారు. శివకుమార్ గురూజీ మాట్లాడుతూ బసవేశ్వరుడు 12వ శతాబ్దానికి చెందిన గొప్ప భారతీయ తత్వవేత్త, కవి మరియు సంఘ సంస్కర్త. ఆయన కుల వ్యవస్థను, లింగ వీవక్షను వ్యతిరేకించి, లింగాయత్ ధర్మాన్ని స్థాపించాడు. కాలమై కైలాసం (శ్రమమే స్వర్గం) అని చాటి సమాజంలో అందరూ సమానమే బోధించిన వీర శైవభక్తి ఉద్యమ నాయకుడు. కర్ణాటక లోని బాగేవాడిలో జన్మించారు. ఆయన శివుని ఆరాధ్యకుడైన వీరశైవ మత ప్రచారకుడు. కుల మత బేధాలను నిరసిస్తూ, అందరూ ఈశ్వరుని కులస్తులే శివ భక్తులని ప్రతిపాదించాడు ఈ కార్యక్రమంలో పోతంగల్ సర్పంచ్ కల్లూరి సంధ్య బజరంగ్, బాన్సువాడ బిజెపి నాయకులు కోనేరు శశాంక్, రుద్రూర్ మండల అధ్యక్షుడు ఆలపాటి హరికృష్ణ, కోటగిరి మండల అధ్యక్షుడు వేముల నవీన్, మెర్కెల్ ప్రకాష్ పటేల్, వీరశైవ లింగాయత్ అధ్యక్షుడు మాలిపటేల్ శివకుమార్, ఉపాధ్యక్షులు నాగేంద్ర పటేల్, మాణిక్ అప్ప, దిగంబర పటేల్, దొడ్డిమీది వ ప్రకాష్ పటేల్, దొడ్డిమీది విజయ పటేల్, శరత్ పటేల్, మాలిపటేల్ ఓమన్న పటేల్, బస్వంత్ పటేల్, శరత్ పటేల్,వీరశైవ లింగాయత్ సభ్యులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.





## వేసవి సెలవుల్లో పిల్లల అభివృద్ధికి క్రీడా సామగ్రి పంపిణీ

**బీర్కూర్, ఏప్రిల్ 19(డిడి9 వార్త):**

బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామంలో ఆదివారం వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.యువత ఇంటిపట్టునే ఉంటూ పిల్లల్లో మేధాశక్తి పెంపొందించేందుకు చిన్నారులకు చెస్ బోర్డులు, అలాగే పెద్ద పిల్లల శారీరక దృఢత్వం కోసం వాలీబాల్ కిట్స్ ను నాచారం హన్మాండ్లు (విఆర్వో) సహకారం అందించగా, చెస్ బోర్డులు అందించడంలో సిద్ధం శెట్టి నారాయణ గుప్తా (ప్రొఫెసర్) సహకరించారు .ఈ సందర్భంగా పిల్లలు, యువత వారిద్దరికీ కృతజ్ఞతలు తెలిపారు.పిల్లల పట్ల చూపుతున్న శ్రద్ధ, వారిలో ప్రతిభను వెలికితీయాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్న మీ ప్రోత్సాహం ఎంతో గొప్పదని గ్రామస్తులు అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ యువత లక్కపల్లి, పోచుగొండ, నాగెల్ల సాయికిరణ్, నవీన్, శ్రీకాంత్, గంగా ప్రసాద్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## మహిళా రిజర్వేషన్ ముసుగులో డిలిమిటేషన్ కు కుట్ర చేసిన NDA ప్రభుత్వం

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ ఏప్రిల్ 19(డి డి 9 వార్త ):-**

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మహిళా సాధికారత పేరుతో తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్, చట్టం వెనుక అసలు ఉద్దేశం ఇప్పుడు బహిర్గతమైందని కాంగ్రెస్ నాయకులు షేక్ షాకీర్ ఆరోపించారు. దేశ ప్రజల దృష్టిని మరల్చేందుకు, రాజకీయ లాభాల కోసం, డీలిమిటేషన్ ప్రక్రియను ముందుకు తెచ్చే కుట్రను చాకచక్యంగా దాచి పెట్టే ప్రయత్నం జరిగింది.

కాంగ్రెస్ పార్టీ ఈ కుటిల వ్యూహాన్ని కుండబద్దలు కొట్టింది. మహిళా రిజర్వేషన్ పేరుతో చట్టం తీసుకువచ్చి, అమలును డీలిమిటేషన్‌కు కట్టిపడేయడం ద్వారా దక్షిణాది రాష్ట్రాలపై అన్యాయం చేయాలనే దురుద్దేశం స్పష్టమవుతోంది. జనాభా నియంత్రణలో ముందుండిన రాష్ట్రాలకు శిక్ష విధించి*, జనాభా పెరుగుదల ఎక్కువగా ఉన్న రాష్ట్రాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించే ప్రయత్నం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధం.

2023 సంవత్సరంలో మహిళా సాధికారతకు 33% మహిళా రిజర్వేషన్ బిల్లును భారత రాజ్యాంగానికి 106 రాజ్యాంగ సవరణ చేసి పార్లమెంట్లో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు కాంగ్రెస్ పార్టీ ముక్తకంఠంతోఅట్టి బిల్లుకు ఆమోదం తెలిపి రాజ్యసభలోను మద్దతు ఇచ్చి చట్ట రూపం దాల్చడానికి,సంపూర్ణ కృషి చేసింది. ఈ చట్టం పట్ల బీజేపీ ప్రభుత్వానికి మహిళల హక్కుల పట్ల నిజమైన నిబద్ధత ఉంటే, ఈ చట్టాన్ని వెంటనే అమలు చేయాల్సింది. కానీ అమలును డీలిమిటేషన్‌తో అనుసంధానం చేయడం వెనుక రాజకీయ లాభాలే ఉన్నాయని స్పష్టంగా కనిపిస్తోంది. ఇది మహిళల భావోద్వేగాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే ప్రయత్నం మాత్రమే.

కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలకు హామీ ఇస్తోంది —— ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు, అన్ని రాష్ట్రాలకు సమాన న్యాయం జరిగేలా పోరాటం కొనసాగుతుంది. దక్షిణాది రాష్ట్రాల హక్కులను హరించే ఏ ప్రయత్నాన్నైనా తీవ్రంగా వ్యతిరేకిస్తాం.

దేశ ప్రజలు ఈ మాయాజాలాన్ని గుర్తించి, బీజేపీ పార్టీ అసలు ముఖాన్ని తెలుసుకోవాల్సిన సమయం వచ్చింది.

ఈ కార్యక్రమంలో, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ షేక్ రజియా బేగం, మాజీ కాంగ్రెస్ పార్టీ మండల డైరెక్టర్ మహమ్మద్, వార్డు సభ్యులు, తిరుపతి, గిరిజ బై సంతోష్, సోహెల్, మాజీ వార్డు సభ్యులు తుకారం, కౌసర్,ఆబూద్ తదితరులు పాల్గొన్నారు.



## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు:ఏఎంసీ చైర్మన్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 19(డీడీ9 వార్త):**

రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తోందని, కర్షకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీల శంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం సాలూర మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోకుండా, ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, నీడ, గన్నీ బ్యాగులు వంటి అన్ని సౌకర్యాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాల మేరకు ఎండబెట్టి తీసుకురావాలని, తద్వారా తూకం వేసిన వెంటనే చెల్లింపులు నేరుగా రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సొక్కం లావణ్య, ఉప సర్పంచ్ బయ్యన్ సురేష్, సతీష్, అల్లే రమేష్, సొక్కం రవి, ఐకేపీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## ఘనంగా బసవేశ్వర మహారాజ్ జయంతి వేడుకలు

**ఆదిలాబాద్, బోథ్ ఏప్రిల్ 19(డిడి9 వార్త):**



బోథ్ మండల కేంద్రంలోని ,మరపెల్లి బస్టాండ్ వద్ద బసవేశ్వర విగ్రహానికి పూల మాల వేసి జయంతి వేడుకలు ప్రారంభించారు. భక్తి పాటలతో భజన కార్యక్రమం ఘనంగా . బసవేశ్వరుడు 12వ శతాబ్దానికి చెందిన గొప్ప భారతీయ తత్వవేత్త, కవి మరియు సంఘ సంస్కర్త. ఆయన కుల వ్యవస్థను, లింగ వీవక్షను వ్యతిరేకించి, లింగాయత్ ధర్మాన్ని స్థాపించాడు. కాలమై కైలాసం (శ్రమమే స్వర్గం) అని చాటి సమాజంలో అందరూ సమానమే బోధించిన వీర శైవభక్తి ఉద్యమ నాయకుడు. కర్ణాటక లోని బాగేవాడిలో జన్మించారు. ఆయన శివుని ఆరాధ్యకుడైన వీరశైవ మత ప్రచారకుడు. కుల మత బేధాలను నిరసిస్తూ, అందరూ ఈశ్వరుని కులస్తులే శివ భక్తులని ప్రతిపాదించాడు ఈ కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సభ్యులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు సాలూర రైతు వేదికలో రైతు నేస్తం ప్రత్యక్ష ప్రసారం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 19(డీడీ9 వార్త):**

సాలూర రైతు వేదికలో సోమవారం మధ్యాహ్నం 2:30 గంటలకు రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ 90వ ఎపిసోడ్ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం నిర్వహించనున్నట్లు వ్యవసాయ విస్తరణాధికారి అపర్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భూసార పరీక్షల ప్రాముఖ్యత, నేల నమూనాల సేకరణ పద్ధతులు, సాయిల్ హెల్త్ కార్డుల విశ్లేషణ మరియు పంటల్లో సూక్ష్మ పోషకాల వినియోగంపై రైతులకు నిపుణులు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా నేల కాలుష్యం, అగ్రి స్టాక్ ఫార్మర్ రిజిస్ట్రీ వంటి కీలక అంశాలపై చర్చతో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని వివరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా నష్టూర్పల్లి నుంచి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారు రెండో విడత రైతు భరోసా నిధులను విడుదల చేసే ఘట్టాన్ని కూడా ఇక్కడ ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజాప్రతినిధులు, అభ్యుదయ, మహిళా మరియు యువ రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.



# చెరువులోకి దూసుకెళ్లిన హార్వెస్టర్

- **తృటిలో తప్పిన ప్రాణాపాయం**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 19(డీడీ9 వార్త):**

సాలూర మండల పరిధిలోని హున్స రామ్‌సాల చెరువులో ఆదివారం సాయంత్రం ఓ భారీ ప్రమాదం తృటిలో తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ హార్వెస్టర్ హున్స గ్రామం నుంచి మందర్న వైపు వెళుతుండగా ఒక్కసారిగా అదుపుతప్పి పక్కనే ఉన్న చెరువులోకి దూసుకెళ్లి బోల్తా పడింది. హార్వెస్టర్ నీటిలో పడిపోవడాన్ని గమనించిన స్థానికులు తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. లోతైన నీటిలో చిక్కుకున్న డ్రైవర్‌ను చాకచక్యంగా బయటకు తీయడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. సమయానికి స్థానికులు స్పందించి సాయం అందించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రమాద సమయంలో డ్రైవర్ తప్ప మరెవరూ వాహనంలో లేకపోవడంతో పెను నష్టం తప్పిందని గ్రామస్థులు పేర్కొన్నారు.

# మల్కాపూర్ లో స్వచ్చా భారత్....

**తూప్రాన్ ఏప్రిల్ 19 (డీడీ9 వార్త )**

మెదక్ జిల్లా తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో 397వ ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. 4వ వార్డులో పరిసర ప్రాంతాలలో ప్లాస్టిక్ ను, చెత్తాచెదారాన్ని తొలగించారు. సిసి రోడ్లను చీపుర్లతో ఊడ్చి శుభ్రపరచారు. గ్రామం శుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యం తో ఉంటారని ఆయన అన్నారు గ్రామ ప్రజల సహకారంతో గ్రామాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్వామి, వార్డు సభ్యులు, జిన్న కృష్ణ, వేణుగోపాల్ , తిరుపతి, అంగన్వాడి టీచర్లు స్వర్ణలత, లావణ్య, వివో ఏ సంతోష, ఆశ వర్కర్ ఇందిరా,మేకిన్ యువత, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



## మాందాపూర్ అంగన్‌వాడీలో పోషణ్ పక్వాడ్..
# టీచర్లకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ

**జగదేవ్ పూర్ ,ఏప్రిల్19, (డీడీ9 వార్త )**

జగదేవ్ పూర్ మండల పరిధిలోని మాందాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో 'పోషణ్ పక్వాడ్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు మరియు చిన్న పిల్లలకు అందించాల్సిన పోషకాహార ప్రాముఖ్యతపై తల్లులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ ఐసీడీఎస్ సీడీపీఓ సరిత , సూపర్వైజర్ సంతోష ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. అంగన్‌వాడీ సేవల డిజిటలైజేషన్‌లో భాగంగా ఇదే వేదికపై టీచర్లకు స్మార్ట్ ఫోన్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో మాందాపూర్ సర్పంచ్ లింగాల మౌనిక ముత్యం, పలుకుగడ్డ సర్పంచ్ నర్రా కనకయ్య, ఉప సర్పంచులు నర్రా రాములు, నర్రా కళ్యాణి, వార్డు సభ్యులు నర్రా నవీన్, నర్రా సురేష్, ఎం. హేమలత పాల్గొన్నారు. అలాగే తీగుల్ పీహెచ్‌సీ డాక్టర్, గ్రామ ఆశా వర్కర్ స్వప్న మరియు అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొని ఆరోగ్య సూత్రాలను వివరించారు.



# మహిళ అదృశ్యం కేసు నమోదు...

**కోనరావుపేట, ఏప్రిల్ .19(డీడీ9 వార్త)**

కోనరావుపేట మండలం మల్కాపేట గ్రామానికి చెందిన కుతాడి అనిత (19) అనే మహిళ అదృశ్యమైందని అనిత ,భర్త కుతాడి బాలకిషన్, పోలీసులకు పిర్యాదు చేశాడు. గ్రామానికి చెందిన కుతాడి అనిత ఆదివారం తెల్లవారుజామున 2:30 గంటలకు ఇంట్లో నుండి కనిపించకుండా పోయిందని చుట్టు పక్కల గ్రామాల్లో బంధువుల ఇళ్లలో వెతికిన ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. ఈ సందర్భంగా



ఎస్సై ప్రశాంత్ రెడ్డి మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# కాంటాలు లేక రైతుల ఆందోళన...
# సొసైటీకి తాళం వేసి నిరసన

- **కోసిన వడ్లకు కాంటాలు లేవు... తాజా వడ్లకు ప్రాధాన్యం ఎందుకు?**
- **స్పందన లేని సొసైటీ సిబ్బందిపై... రైతుల ఆగ్రహం**
- **వెంటనే చర్యలు తీసుకోకపోతే ధర్నాలు, రాస్తారోకాలు చేస్తాం రైతుల హెచ్చరిక**

**బీర్కూర్, ఏప్రిల్ 19(డిడి9 వార్త):**

బీర్కూర్ మండలంలోని బైరాపూర్ గ్రామంలో సొసైటీ కార్యదర్శి భూమయ్య నిర్లక్ష్యం రైతుల ఆగ్రహానికి కారణమైంది.తాము ఆరుగాలం కష్టించి, చెమటలతో పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తూ రైతులు సొసైటీ కార్యాలయానికి తాళం వేసి తీవ్రస్థాయిలో నిరసన తెలిపారు. సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉన్న అధికారులే కనీస స్పందన ఇవ్వకపోవడం పట్ల రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొసైటీ పరిధిలో కోసిన ధాన్యానికి కాంటాలు చేయకుండా కాలయాపన చేస్తూ, ఇతర ప్రాంతాలకు ప్రాధాన్యం ఇవ్వడం వెనుక అసలు ఉద్దేశ్యం ఏమిటని రైతులు నిలదీశారు.మా ధాన్యం పాడైపోతే బాధ్యత ఎవరు తీసుకుంటారు? నష్టపోయేది రైతే కదా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. వ్యవస్థలో పారదర్శకత లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపించారు.

సొసైటీ కార్యదర్శి భూమయ్య గత వారం రోజులుగా విధులకు గైర్హాజరు కావడం, పలుమార్లు సంప్రదించినా స్పందించకపోవడం రైతుల ఆగ్రహాన్ని మరింత పెంచింది. ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు అందుబాటులో లేకపోవడం వారి విధినిర్వహణ లోపాలకు నిదర్శనమని మండిపడ్డారు. పదవులు మాత్రం ఉంటాయి, బాధ్యతలు మాత్రం కనిపించవు అంటూ తీవ్రంగా విమర్శించారు.ప్రస్తుతం వాతావరణ హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో కోసిన ధాన్యం తడిసిపోతుందనే భయం రైతులను వెంటాడుతోందని వారు అన్నారు. ఏప్రిల్ 4న కోసిన వడ్లకు ఇప్పటికీ కాంటాలు చేయకపోగా, ఇటీవల కోసిన వడ్లకు మాత్రం వెంటనే కాంటాలు వేయడం అనుమానాలకు తావిస్తోంది. ఇది యాదృచ్ఛికం కాదని, స్పష్టమైన నిర్లక్ష్యం రైతులు మండిపడుతూన్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేసి ధర్నాలు, రాస్తారోకాలు చేస్తామని హెచ్చరించారు.రైతు కష్టాన్ని పట్టించుకోని అధికారులను ఇక సహించబోము అంటూ గట్టిగా హెచ్చరించారు..











# సాలూరలో భక్తిప్రపత్తులతో మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలు





**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 19(డీడీ9 వార్త):**

జగజ్యోతి బసవేశ్వరుడి జయంతి వేడుకలు ఆదివారం సాలూర మండల కేంద్రంలో వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో కన్నులపండువగా జరిగాయి. రాచన్న మందిరం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు నిర్వహించిన శోభాయాత్ర భక్తిభావాన్ని నింపింది. ఈ సందర్భంగా మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి, మంగళహారతులతో ఊరేగింపులో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పురవీధులన్నీ 'జై బసవన్న' నినాదాలతో ప్రతిధ్వనించాయి. శోభాయాత్ర బస్టాండ్ కూడలికి చేరుకున్న అనంతరం భక్తులు బసవన్న విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమాజ పెద్దలు మాట్లాడుతూ.. సమాజంలో కులమత వివక్షను పారద్రోలి, సమసమాజ స్థాపన కోసం కృషి చేసిన గొప్ప సంస్కర్త బసవేశ్వరుడని కొనియాడారు. ఆయన బోధించిన కాయకవే కైలాస సూత్రం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లింగాయత్ సమాజ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## ఆ స్టార్ హీరోతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం నా అదృష్టం



మలయాళ ముద్దుగుమ్మ మమిత బైజు 'ప్రేమలు' సినిమాతో ఓవర్‌నైట్ సెన్సేషన్‌గా మారిపోయింది. ఆ మూవీలో తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో కుర్రకారు మనసు దోచుకున్న ఈ భామ, ప్రస్తుతం సౌత్ ఇండియాలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోయింది. కేవలం మలయాళంలోనే కాకుండా, ఇప్పుడు టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీలలో స్టార్ హీరోల సరసన క్రేజీ ఆఫర్లు దక్కించుకుంటూ ఫుల్ ఫామ్‌లో ఉంది. మమిత బైజు ప్రస్తుతం ఫుల్ బిజీ బిజీగా గడుపుతోంది. కోలీవుడ్ స్టార్ హీరో సూర్య సరసన 'విశ్వానాథ్ అండ్ సన్స్'లో కథానాయికగా నటిస్తోంది. అలాగే, దళపతి విజయ్ ఆఖరి చిత్రం 'జన నాయగన్'లో ఒక కీలక పాత్రలో కనిపించబోతోంది. ఇక ఆమెకు లైఫ్ ఇచ్చిన 'ప్రేమలు' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'ప్రేమలు-2'లో కూడా మమిత నటిస్తుండటంతో అభిమానుల అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కోలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ ధనుష్ సరసన 'కారా' చిత్రంలో కూడా ఆమె నటిస్తోంది. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్ ఏప్రిల్ 30న థియేటర్లలోకి రాబోతోంది. ఇందులో మమిత 'సెల్లి' అనే పాత్రలో ఒక విభిన్నమైన లుక్‌లో కనిపించబోతోంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న మమిత, ధనుష్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. "నేను మొదటి నుంచీ ధనుష్ గారి నటనకు పెద్ద అభిమానిని. ఆయన సినిమాల్లోని డైలాగ్ డెలివరీ, బాడీ లాంగ్వేజ్‌ను నేను చాలా నిశితంగా గమనిస్తుంటాను. 'కారా' సెట్స్‌లో ఆయనతో కలిసి నటించడం నాకు ఒక యాక్టింగ్ స్కూల్‌లో ఉన్నట్లు అనిపించింది. ఆయన సెట్స్‌లో తన సహనటులకు ఎంతో స్వేచ్ఛను, సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పిస్తారు. ఆయన నుంచి నటనలో ఎన్నో మెళకువలు నేర్చుకున్నాను. ధనుష్ సర్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం నా అదృష్టం" అని మమిత చెప్పుకొచ్చింది. మొత్తానికి, 'ప్రేమలు' పిల్ల తన టాలెంట్‌తో సౌత్ సినిమా ఇండస్ట్రీని ఒక ఊపు ఊపేస్తోంది. అటు గ్లామర్, ఇటు పర్ఫార్మెన్స్‌తో మెప్పిస్తున్న మమిత, భవిష్యత్తులో మరిన్ని రికార్డులు

## ఎండైనా నో 'ట్రబుల్'.. ఫహాద్ ఫాజిల్ డెడికేషన్..

మలయాళ ఫహద్ ఫాజిల్ హీరోగా నటిస్తున్న స్ట్రెయిట్ తెలుగు చిత్రం 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. ఇది ఒక క్వర్కీ ఫాంటసీ ఎంటర్‌టైనర్ అని తెలుస్తుండగా.. శశాక్ యేలేటి దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ సినిమా షూటింట్ హైదరాబాద్‌లో జరుగుతుండగా.. షూటింగ్ నుంచి ఇంట్రెస్టింగ్ వీడియో షేర్ చేశారు మేకర్స్. ఇక వీడియోలో ఎర్రటి ఎండలో నటుడు ఫహాద్ తన చిత్రం షూటింగ్‌లో నిమగ్నమయినట్లు చూపించారు. తీవ్రమైన ఎండ వేడికి చెమటలు కక్కుతున్నా ఆయన డెడికేషన్‌తో పని చేస్తుండగా.. ఆయన అసిస్టెంట్ మాత్రం ఫహద్‌కు గొడుకు పెట్టకుండా తనకు పెట్టుకోవడం, షూటింగ్ గ్యాప్‌లో చిత్ర బృందం కొబ్బరి నీళ్లు, మజ్జిగ తాగుతూ తాపం నుంచి ఉపశమనం పొందడం, సన్‌స్క్రీన్ అప్లై చేసుకోవడం ఇలా చిత్రీకరణ కష్టాన్ని సైతం ఎంటర్‌టైనింగ్ రూపంలో షూటింగ్ వీడియో రిలీజ్ చేయడంతో ప్రజెంట్ అది వైరల్‌గా మారింది. ఇక ఈ వీడియో లాస్ట్‌లో 'వేడి గాలుల గురించి చింతించకండి' అనే క్యాప్షన్ ఆకట్టుకుంటోంది.



## కోల్పోయాకే దాని విలువ



తెలుగులో 'పిల్లా నువ్వు లేని జీవితం', 'సుబ్రహ్మణ్యం ఫర్ సేల్' వంటి సినిమాలతో మెప్పించిన అందాల భామ రెజీనా కాసాండ్రా. ప్రజెంట్ తెలుగులో అవకాశాలు తగ్గడంతో కొలివుడ్ లో, బాలీవుడ్ లో బిజీగా గడుపుతోంది. మూకుతి అమ్మన్ 2 నయనతారతో కలిసి ఈ సీక్వెల్‌లో నటిస్తున్న రెజీనా. అలాగే 'ఫ్లాష్‌బ్యాక్' అనే తమిళ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. సెక్షన్ 108 మూవీ హిందీలో నవాజుద్దీన్ సిద్ధిఖీ సరసన నటిస్తున్నారు. అయితే మూవీస్ విషయం పక్కన పెడితే.. తాజాగా తన ఇన్ స్టాగ్రామ్ స్టోరీలో చేసిన వ్యాఖ్యలు అభిమానులను ఆలోచనలో పడేశాయి. తన 20 ఏళ్ల సినీ కెరీర్‌లో ఎన్నో ఒడిదుడుకులను చూసిన ఈ భామ, వ్యక్తిగత జీవితం, ప్రేమలోని లోతు గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు.

రెజీనా తన పోస్ట్‌లో ప్రేమ గురించి వివరిస్తూ.. 'ఒకరోజు నన్ను నేను ప్రేమకు పూర్తిగా అప్పగించుకున్నాను. చాలామంది పరిస్థితులకు లొంగిపోవడాన్ని నిస్సహాయత అనుకుంటారు, కానీ ప్రేమ అనేది ఒక నిశ్శబ్ద శక్తి. మనం ప్రేమించబడటానికి అర్హులమని గుర్తుంచుకోవడానికి ప్రతి రోజూ ఒక మంచి రోజే. ప్రేమించడం, ప్రేమించబడటంలోనే నిజమైన ఆనందం ఉంది. దాన్ని కోల్పోయినప్పుడు కలిగే బాధ ఎలా ఉంటుందో మనకు తెలుసు కాబట్టే, ఆ అనుభూతిని తేలికగా తీసుకోకూడదు' అని పేర్కొన్నారు. గత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ.. 'కృతజ్ఞతతో ప్రపంచాన్ని చూసినప్పుడు ఆ అనుభూతి భిన్నంగా ఉంటుంది. నా పాత జ్ఞాపకాలను ఆ దృష్టితో చూసినప్పుడు ఎంతో మార్పు కనిపించింది' అంటూ కొన్ని ఫోటోలను పంచుకున్నారు. ఇక ఈ పోస్ట్ చూసి, ఆమె జీవితంలో ఏదైనా కొత్త మార్పు వచ్చిందా? లేదా పాత జ్ఞాపకాలు గుర్తొచ్చాయా? అని నెటిజన్లు ఆరా తీస్తున్నారు

## నాకు ఆ అవసరం లేదు..



శ్రీరాముడిపై నటుడు ప్రకాశ్‌రాజ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. దీనిపై ఆయన తాజాగా స్పందించారు. సోషల్ మీడియా వేదికగా మాట్లాడారు. ''ఇటీవల నేను ఓ సాహితీ కార్యక్రమంలో ఇచ్చిన ప్రసంగంలోని కొన్ని మాటలను మాత్రమే తీసుకుని కొందరు వక్రీకరించారు. నేనేదో అవతారపురుషుడు శ్రీరాముడి గురించి తప్పుగా మాట్లాడానని, హిందువుల మనోభావాలను గాయపరిచానని అంటున్నారు. అన్ని ధర్మాలను, అందరినీ ప్రేమించే నాకు ఆ అవసరం లేదు. కొందరు రాజకీయ నాయకులు నేను అడిగే ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేక.. హిందూ వ్యతిరేకిగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారు'' అని పేర్కొన్నారు.

## ఎన్టీఆర్ ఫ్యాన్స్ కు బిగ్ ట్రీట్.. ఒకే రోజు నాలుగు మూవీ అప్‌డేట్స్!

జూనియర్ ఎన్టీఆర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. నందమూరి కుటుంబ వారసత్వాన్ని అందిపుచ్చుకొని ఇండస్ట్రీలో అడుగు పెట్టిన జూనియర్ ఎన్టీఆర్, ఇప్పుడు పాన్ ఇండియా స్టార్ హీరోగా మారిపోయాడు. RRR బంపర్ హిట్ అయిన తర్వాత జూనియర్ ఎన్టీఆర్, అన్ని కూడా పాన్ ఇండియా సినిమాలే చేస్తున్నాడు. ప్రస్తుతం నాలుగు కు పైగా సినిమాలను లైన్ లో పెట్టాడు జూనియర్ ఎన్టీఆర్.

జూన్ 20వ తేదీన జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు అన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆ రోజున నాలుగు భారీ చిత్రాలకు సంబంధించిన అప్డేట్స్ విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారట. డ్రాగన్ సినిమాకు సంబంధించిన పవర్ ఫుల్ గ్లింప్స్ రిలీజ్ చేయబోతున్నారట. దేవర 2 పైన కూడా అప్డేట్ ఇస్తారని తెలుస్తోంది. గాడ్ ఆఫ్ వార్ సినిమాకు సంబంధించిన అనౌన్స్మెంట్ కూడా ఉంటుందని టాక్ నడుస్తోంది. ప్రశాంత్ నీల్, కొరటాల శివ, త్రివిక్రమ్ శ్రీనివాస్, వెట్రిమారన్ లాంటి ప్రముఖులతో కలిసి జూనియర్ ఎన్టీఆర్ చేస్తున్న ఈ కొత్త ప్రాజెక్టులపై అంచనాలు భారీగానే ఉన్నాయి. ఇక వీటికి సంబంధించిన అప్డేట్స్ వస్తే.. మరింత హైప్ వస్తుంది.



## మా ప్రయత్నాన్ని గౌరవించారు

'ప్రేక్షకులకు ఓ వాస్తవిక అనుభూతిని అందివ్వాలనే లక్ష్యంతో 'డెకాయిట్' కోసం చాలా కష్టపడ్డాం. ఇప్పుడు మా ప్రయత్నాన్ని అందరూ గౌరవించారన్న భావన కలిగింది'' అన్నారు కథానాయకుడు అడివి శేష్. ఇప్పుడాయన.. మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన ఈ సినిమాని షానియల్ డియో తెరకెక్కించారు. సుప్రియ యార్లగడ్డ, సునీల్ నారంగ్ నిర్మించారు. ఈ చిత్రం ఇటీవల విడుదలైన నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లో థాంక్యూ మీట్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో అడివి శేష్ మాట్లాడుతూ.. ''ఈ చిత్ర వేడుకల్లో భాగంగా బెంగళూరుకి వెళ్లినప్పుడు ఓ లాయర్‌ని కలిశా. తనని కొంతమంది కొట్టారని.. చాలా రోజులుగా ఆస్పత్రిలో ఉన్నానని.. ఆ తర్వాత తను మళ్లీ బయటకు రావడానికి 'మేజర్' చిత్రం ధైర్యం ఇచ్చిందని చెప్పారు. అందరి నుంచి ఇలాంటి ప్రేమ పొందుతున్నప్పుడు.. ఇదే కదా అసలైన క్రెడిబిలిటీ అనిపిస్తుంది. అందుకే నాకు 'గుడ్ సినిమా శేష్' అనే ట్యాగ్ రావాలని కోరుకుంటున్నా. నాకు అలాంటి సంతృప్తిని ఈ 'డెకాయిట్' ఇచ్చింది. దీనితోనే నా కెరీర్‌లో తొలిసారి మ్యూజికల్ హిట్‌నీ కొట్టా'' అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత సుప్రియ యార్లగడ్డ, షానియల్ డియో, భీమ్స్ సిసిరోలియో, భాస్కర్ భట్ల, అబ్బూరి రవి తదితరులు పాల్గొన్నారు.



## ధర్మ రక్షణ కోసం పరశురాముడి ఆగమనం..

భారతీయ చలనచిత్ర రంగంలో యానిమేటెడ్ చిత్రాల సత్తాను చాటిన 'మహావతార్ నరసింహ' అఖండ విజయం తర్వాత, 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్' నుంచి రెండో అడుగు పడింది. హోంబలే ఫిల్మ్స్ మరియు క్లీమ్ ప్రొడక్షన్ సంయుక్తంగా నిర్మిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం "మహావతార్ పరశురామ్" మోషన్ పోస్టర్‌ను నేడు పరశురామ జయంతి సందర్భంగా చిత్ర బృందం విడుదల చేసింది.

కేవలం 40 కోట్ల బడ్జెట్‌తో రూపొంది, బాక్సాఫీస్ వద్ద 300 కోట్లకు పైగా వసూళ్లతో రికార్డు సృష్టించిన 'మహావతార్ నరసింహ' చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. దర్శకుడు అశ్విన్ కుమార్ విష్ణుమూర్తి దశావతారాల ఆధారంగా మొత్తం ఏడు చిత్రాలను ఈ యూనివర్స్‌లో భాగంగా రూపొందిస్తుండగా, రెండో చిత్రంగా పరశురాముడి కథను ఎంచుకున్నారు. తాజాగా విడుదలైన పోస్టర్‌లో యుద్ధ wభూమిలో రక్తసిక్తమైన గొడ్డలిని ధరించి, రౌద్ర రూపంలో ఉన్న పరశురాముడిని చూపిస్తూ "ధర్మం పతనమైనప్పుడు పరశురాముడు ఉద్భవిస్తాడు.. ఆయన పాలకుడు కాదు, అధర్మాన్ని అంతమొందించే శక్తి" అని పేర్కొనడం విశేషం. సామ్ సి.ఎస్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రం అత్యాధునిక 3D యానిమేషన్ సాంకేతికతతో సిద్ధమవుతోంది. విజయ్ కిరగందూర్ నిర్మాణంలో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ చిత్రం తెలుగు, కన్నడ, హిందీ, తమిళం మరియు మలయాళ భాషల్లో 2027 డిసెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

